

అతిక్రమిస్తే చర్యలు

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే జరిమానాలు విధిస్తామని చేవెళ్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశం హెచ్చరించారు. 10లో▸



నేడు 'చలో శంషాబాద్'

శంషాబాద్‌లో బుధవారం చేపట్టిన నిరసనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కిరణ్‌పూలే అన్నారు. 10లో▸



నష్టం వాటిల్లకుండా..

రోడ్డు విస్తరణ పనులకు స్థానికులు, వ్యాపారస్తులు సహకరించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. 10లో▸

న్యూస్‌రీల్

నేటి నుంచి హ్యాండ్‌బాల్ పోటీలు

తుర్కయంజాల్: జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పురపాలక సంఘం పరిధి తొర్రూర్‌లో 53వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్–2024 పోటీలను ప్రారంభించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు సోలిపురం వెంకట్ రాంరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొననున్నట్లు తెలిపారు.

పదినెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదు

రాష్ట్ర సహకార సంఘం మాజీ చైర్మన్ రాజావరప్రసాద్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాజావరప్రసాద్

షాద్‌నగర్: రేవంత్‌రెడ్డి సీఎం పీఠం ఎక్కి పది నెలలు పూర్తయినా సొంత పాలమూరు జిల్లాకు చేసిందేమీ లేదని రాష్ట్ర సహకార సంఘం మాజీ చైర్మన్ రాజావరప్రసాద్ విమర్శించారు. పట్టణంలోని ఓ హోటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు, ప్రజల సాగునీరు, తాగునీటి కష్టాలు తీర్చేందుకు చేపట్టిన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పనులను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 85 శాతం పూర్తి చేసిందని తెలిపారు. మిగిలిన 15 శాతం పనులు పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ధ్వజమెత్తారు. మూసీ ప్రక్షాళన రూ.లక్షల కోట్లు కేటాయించిందని, పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టుకు ఎందుకు కేటాయించడం లేదని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన పేరుతో పేదల ఇళ్లు కూల్చుతున్న సీఎం రేవంత్‌రెడ్డికి దమ్ముంటే ఎంజీబీఎస్, హైకోర్టు, సాలార్‌జంగ్ మ్యూజియంలను కూల్చాలని డిమాండ్ చేశారు. బతుకమ్మ చీరలు, పెన్షన్లు, రైతు భరోసా పథకాలను ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని దుయ్యబట్టారు. సమావేశంలో నాయకులు రాజశేఖర్, అశోక్, సాయి తదితరులు పాల్గొన్నారు.

పదేళ్లు పాలించిన బీఆర్‌ఎస్ చేసిందేమిటి?

కాంగ్రెస్ ఆదివాసీ సంఘం జిల్లా చైర్మన్ శ్రీను నాయక్



మాట్లాడుతున్న శ్రీను నాయక్

షాద్‌నగర్: రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదని కాంగ్రెస్ ఆదివాసీ సంఘం జిల్లా చైర్మన్ శ్రీను నాయక్ ప్రశ్నించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి చేతకాకపోవడంతోనే పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తి చేయలేదని విమర్శించారు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ వద్ద కుర్చీ వేసుకొని నిర్మిస్తానని నాటి సీఎం కేసీఆర్ చెప్పారని గుర్తు చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలు చేపట్టినందుకే బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేకనే బీఆర్‌ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే అర్హత బీఆర్‌ఎస్ పార్టీ నేతలకు లేదని హితవు పలికారు. విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు దేవగిరి నవీన్, వినోద్ నాయక్, వేణు నాయక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీ స్టేడియం కేంద్రంగా ట్రాఫిక్ ఆంక్షలు నేడు

సాక్షి, సిటీబ్యూరో: ఎల్బీ స్టేడియంలో బుధవారం 'డీఎస్సీ–2024 కొలువుల పండగ' జరగనుంది. ఇందులో పాల్గొనే సీఎం రేవంత్‌రెడ్డి డీఎస్సీకి ఎంపికైన 11 వేల మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందించనున్నారు. ఈ కార్యక్రమం నేపథ్యంలో ఎల్బీ స్టేడియం కేంద్రంగా ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూ ఆ విభాగం చీఫ్ పి.విశ్వప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 8 గంటల వరకు స్టేడియం చుట్టు పక్కల మార్గాల్లో సాధారణ వాహనాలకు మళ్లింపులు వర్తిస్తాయి. వాహన చోదకులు వీటిని దృష్టిలో పెట్టుకుని సహకరించాలని పోలీసులు కోరారు.

రుణం.. స్వాహా పర్వం!

డీసీసీబీల్లో మేనేజర్ల చేతివాటం

యాచారం మండల కేంద్రంలోని డీసీసీబీ బ్రాంచ్‌లో విధులు నిర్వర్తించిన ఓ మేనేజర్, మరో ఇద్దరు సిబ్బందితో కలిసి వ్యక్తిగత రుణాల పేరుతో బురిడీ కొట్టించారు. నకిలీ రికార్డులు సృష్టించి రూ.23 లక్షలు స్వాహా చేశారు. కొద్ది రోజుల క్రితం ఉన్నతాధికారుల తనిఖీలో ఈ విషయం వెలుగులోకి రావడంతో మేనేజర్, ఇద్దరు సిబ్బందిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మేనేజర్ స్వాహా చేసిన మొత్తాన్ని తిరిగి చెల్లించాడు. ఉన్నతాధికారులు మేనేజర్‌తో పాటు మరో ఇద్దరు సిబ్బందిపై వేటు వేశారు. ఈ ఒక్క బ్రాంచ్‌లోనే కాదు ఉమ్మడి జిల్లా (రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్)లోని పలు బ్రాంచ్‌ల్లో మేనేజర్లు వ్యక్తిగత రుణాల పేర్లతో నిధులు పక్కదారి పట్టిస్తున్నారని ఉన్నతాధికారులకు పక్కా సమాచారం అందింది.



జిల్లా సహకార కేంద్ర బ్యాంకు

- వ్యక్తిగత రుణాల పేరిట నిధులు పక్కదారి
- యాచారం బ్రాంచ్‌లో వెలుగులోకి..!
- అప్రమత్తమైన ఉన్నతాధికారులు
- ఉమ్మడి జిల్లాలోని అన్ని బ్రాంచ్‌ల్లో తనిఖీలకు సన్నద్ధం
- నాలుగు ప్రత్యేక బృందాల ఏర్పాటు
- నిబంధనలకు విరుద్ధంగా పైసా డ్రా చేసినా చర్యలకు రంగం సిద్ధం

యాచారం: ఉమ్మడి జిల్లాలోని డీసీసీబీ (హైదరాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు) పరిధిలో 30 బ్రాంచ్‌లు పనిచేస్తున్నాయి. వీటిలో దాదాపు లక్ష 60 వేల మంది ఖాతాదారులు ఉన్నారు. రూ.1,850 కోట్లకు పైగా ఆర్థిక లావాదేవీలు సాగుతున్నాయి. ఈ బ్యాంకుల్లో రైతులకు స్వల్ప, దీర్ఘకాలిక రుణాలతో పాటు వ్యక్తిగత, బంగారు తాకట్టు, గృహనిర్మాణం, విదేశీ విద్య, ఉద్యోగాలకోసం పలు రకాల రుణాలు ఇస్తున్నారు. కమర్షియల్ బ్యాంకులకు దీటుగా ఈ బ్యాంకుల్లో చిరు వ్యాపారులకు రూ. లక్షల్లో వ్యక్తిగత రుణాలు సైతం అందజేస్తున్నారు. అడిగిన వెంటనే రుణాలు అందజేస్తుండడంతో చాలామంది రుణం తీసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

వ్యక్తిగత రుణాల పేరుతో..

కొంతమంది మేనేజర్లు వ్యక్తిగత, బంగారు రుణాల పేరుతో రూ. లక్షలాది రుణాలు తీసుకుని స్వాహా చేసినట్లు తెలుస్తోంది. వారి వెసులుబాటు కోసం బ్యాంకుల్లో సీసీ కెమెరాలు కూడా బిగించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న కొన్ని బ్రాంచ్‌ల్లో మేనేజర్లు ఇష్టానుసారంగా రుణాలు ఇస్తున్నారని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. నిబంధనల ప్రకారం రుణగ్రహీతల నుంచి రికార్డులు సక్రమంగా తీసుకోకపోవడం, రూ.లక్షలాది రుణాలు ఇచ్చిన వాటికి సంబంధించి రికార్డుల్లో లేకపోవడం తనిఖీల్లో వెలుగులోకి వచ్చాయి. కొన్ని బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతుల రికార్డుల ప్రకారం ఆయా గ్రామాలకు వెళ్లి విచారించగా తాము పైసా కూడా తీసుకోలేదని చెప్పినట్లు సమాచారం.

డీసీసీబీ వివరాలు

మొత్తం బ్రాంచ్‌లు:	30
ఖాతాదారుల సంఖ్య:	1.60 లక్షలు
స్వల్ప కాలిక రుణాలు పొందిన రైతులు:	49,000
దీర్ఘకాలిక రుణాలు పొందిన రైతులు:	20,000
మొత్తం ఆర్థిక లావాదేవీలు:	రూ.1,850 కోట్లు

ఇక వారంవారం తనిఖీలే..

యాచారం బ్యాంకులో నిధుల స్వాహాపై అలర్ట్ అయిన ఉన్నతాధికారులు ఇక వారంవారం తనిఖీలు చేపట్టేలా కార్యాచరణ రూపొందించారు. హైదరాబాద్‌లో ఉన్న కేంద్ర బ్యాంకుతో సహా ఉమ్మడి జిల్లాలోని మిగతా 29 బ్రాంచ్‌ల్లో తనిఖీలకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఏజీఎం, డీజీఎంల ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. మరో 20 మంది సీనియర్ సిబ్బందికి రికార్డుల తనిఖీలపై శిక్షణ ఇస్తున్నారు. ప్రత్యేక టీంలు వారానికోసారి ఆయా బ్యాంకులను సందర్శించి రుణాలు, వసూళ్లకు సంబంధించి రికార్డులను తనిఖీ చేస్తాయి. తనిఖీల్లో పైసా తేడా వచ్చినా బాధ్యులైన మేనేజర్, ఇతర సిబ్బందిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు విధుల నుంచి తొలగిస్తారు. ఈ టీంలు వచ్చే వారం నుంచే తనిఖీలకు సన్నద్ధం అవుతున్నాయి. అన్ని బ్యాంకుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, హైదరాబాద్‌లో ఉన్న కేంద్ర బ్యాంకుకు అనుసంధానం చేసి ప్రత్యేక సిబ్బందితో మేనేజర్ల కదలికలపై నిఘా పెట్టారు.

అక్రమాలను సహించేది లేదు



బ్యాంకుల్లో మేనేజర్లు నింబంధనలకు విరుద్ధంగా రుణాలిస్తే సహించేది లేదు. యాచారం బ్రాంచ్‌లో నిధుల స్వాహాపై పోలీసులకు ఫిర్యాదు చేసి రికవరీ చేశాం. బాధ్యులైన వారిని చర్యలు తీసుకున్నాం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని బ్రాంచ్‌ల్లో గట్టి నిఘా ఏర్పాటు చేశాం. వారంవారం తనిఖీలకు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేశాం. త్వరలో కొన్నేళ్లుగా పాతుకుపోయిన మేనేజర్లను బదిలీ చేస్తాం. అన్ని బ్యాంకుల్లో సీసీ కెమెరాలు ఉండేలా, కేంద్ర బ్యాంకులో పర్యవేక్షణ చేసేలా అనుసంధానం చేస్తున్నాం.

– కొత్తకుర్మ సత్తయ్య, డీసీసీబీ చైర్మన్

ప్రగతి చక్రం పరుగులు

- లాభాల బాటలో 'పట్నం' ఆర్టీసీ డిపో
- మహిళలకు ఉచిత ప్రయాణంతో పెరిగిన ఆదాయం



ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో లాభాల బాటలో పయనిస్తోంది. డిపోలో 70 ఆర్టీసీ, 61 అద్దె బస్సులు ఉన్నాయి. నిత్యం 38 వేల కిలోమీటర్లకు పైగా ఈ డిపో నుంచి బస్సులు తిరుగుతుంటాయి. సుమారు లక్షన్నర మందిని వారివారి గమ్యస్థానాలకు చేరుస్తుంటాయి. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం లేకముందు నిత్యం రూ.15 లక్షల నుంచి రూ.16 లక్షల ఆదాయం వచ్చేది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు మహాలక్ష్మీ పథకం కింద ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. దీంతో ఒక్కసారిగా బస్సుల్లో రద్దీ పెరిగింది. ప్రతి రోజు వచ్చే ఆదాయం అమాంతం రూ.28 లక్షల నుంచి రూ.29 లక్షలకు చేరింది. ప్రతీ నెల రూ.8.50 కోట్ల నుంచి రూ.9 కోట్లు ఈ డిపోకు సమకూరుతున్నాయి. 2022–23, 2023–24 సంవత్సరాల్లో ఈ డిపో ఆదాయంలో ప్రగతిని సాధించడంతో రాష్ట్రస్థాయిలో గుర్తింపు దక్కించుకుంది. ఈ మేరకు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా ఒకసారి రూ.రెండు లక్షలు, మరోసారి రూ.రెండున్నర లక్షల నగదు పురస్కారాన్ని, ప్రగతి చక్ర అవార్డులను సొంతం చేసుకున్నారు. డిపో సిబ్బంది సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందని అధికారులు తెలిపారు. ఎప్పటికప్పుడు డ్రైవర్లను అప్రమత్తం చేస్తున్నామని, పలు విషయాలపై అవగాహన కల్పిస్తూ సూచనలు ఇస్తుండటంతో ప్రమాదాల సంఖ్య కూడా గణనీయంగా తగ్గినట్లు చెబుతున్నారు.

కాలం చెల్లిన బస్సులు తొలగిస్తే మేలు

డిపోలో సుమారు 10 వరకు కాలం చెల్లిన బస్సులు ఉన్నాయి. వాటిని తొలగించి కొత్త వాటిని తీసుకురావాల్సిన అవసరం ఉంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం చార్జీలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లిస్తే కొత్త బస్సుల కొనుగోలుకు మార్గం సుగమం అవుతుందని విశ్లేషకులు అంటున్నారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆ దిశగా ఆర్టీసీ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కొత్త బస్సులకు ప్రతిపాదనలు



డిపోకు కొత్తగా 12 బస్సులు అవసరం. అందుకు ప్రతిపాదనలు పంపాం. కాలం చెల్లిన 8 బస్సులను పక్కన పెట్టాం. బస్సుల్లో ఉచిత మహిళల ప్రయాణంతో రద్దీ పెరిగింది. గడిచిన రెండేళ్లుగా రాష్ట్రంలోనే ఆదాయంలో అగ్రగామిగా నిలుస్తూ రాష్ట్ర స్థాయి నగదు పురస్కారాలను అందుకున్నాం. డ్రైవర్లను అప్రమత్తం చేస్తూ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. సిబ్బందికి హెల్త్ చెకప్‌లు చేయిస్తున్నాం.

– బి.వెంకటనర్సప్ప, డిపో మేనేజర్, ఇబ్రహీంపట్నం



రాష్ట్రస్థాయి అవార్డు, నగదు పురస్కారంతో డిపో సిబ్బంది (ఫైల్)



ఇబ్రహీంపట్నంలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

పాలస్తీనాపై మారణకాండను ఆపాలి

ఇబ్రహీంపట్నం: పాలస్తీనాపై ఇజ్రాయిల్ మారణకాండను ఆపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నంలో మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాజా కేంద్రంగా ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధంలో పాలస్తీనావాసులు సుమారు 42 వేల మంది బలయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు, చిన్నారులు, ఆస్పత్రులపై దాడులు చేస్తూ మానవత్వాన్ని మంటగలుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐక్యరాజ్యసమితి చెబుతున్నా ఇజ్రాయిల్ పట్టించుకోకుండా దాడులు చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. శాంతియుతంగా చర్చల ద్వారా ఇరు దేశాలు సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. పాలస్తీనాకు ప్రధాని నరేంద్ర మోదీ మద్దతుగా నిలిచి, యుద్ధాన్ని ఆపేవిధంగా ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తేవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, సామెల్, జంగయ్య, జగదీశ్, నర్సింహ, శ్యాంసుందర్, జగన్, శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లేశ్, బుగ్గరాములు, యాదగిరి, శ్రీకాంత్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికను కాపాడాలి

ఇబ్రహీంపట్నం రూరల్: తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కమ్మగూడలో కబ్జాకు గురైన శ్మశానవాటికను కాపాడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మట్లాడుతూ.. శ్మశానవాటికను కాపాడడంలో అధికారుల నిర్లక్ష్యం తగదన్నారు. కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, చుట్టూ ప్రహరీ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పగడాల యాదయ్య, డి.జగదీష్, జిల్లా నాయకులు కిషన్, నర్సింహ, సత్యనారాయణ, భాస్కర్, మాల్యాద్రి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కలిసి సాగుదాం

- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ

అనంతగిరి: వేర్వేరు రాజకీయ పార్టీల ద్వారా ప్రజాప్రతినిధులుగా ఎన్నికైనా, చేవెళ్ల ప్రాంత అభివృద్ధి విషయంలో కలిసి సాగుదామని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల అభివృద్ధిపై చర్చించారు. ముఖ్యంగా జీఓ నంబర్ 111 ప్రాంతాన్ని సస్టైనబుల్ డెవలప్‌మెంట్ జోన్‌గా మార్చాలని కోరారు. గత ప్రభుత్వం షాబాద్ మండలం సీతారాంపురంలో ఆలయ భూములను స్వాధీనం చేసుకుందని వాటిని తిరిగి ఆలయానికి కేటాయించాలని కోరారు. జంట నగరాల్లో సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల నిర్వహణ, కాళేశ్వరం ప్రాజెక్టుపై పలు సూచనలు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం, పెండింగ్ సమస్యలపై లోతైన చర్చ చేసి సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించినట్లు తెలిపారు.



ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్సవాలు

మహేశ్వరం శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు ఆరోరోజు మంగళవారం శ్రీమహాలక్ష్మీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి, పరమ శివుడికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీమహాలక్ష్మీ దేవి హోమం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, డైరెక్టర్లు, గ్రామ పెద్దలు, ఆలయ పూజారులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ కొండా ప్రత్యేక పూజలు

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.



శ్రీమహాలక్ష్మీ దేవి అలంకారంలో అమ్మవారు

కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబరాలు



బతుకమ్మలతో మహిళా ఉద్యోగులు



బతుకమ్మ ఎత్తుకున్న కలెక్టర్ శశాంక తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని కలెక్టర్ శశాంక పిలుపునిచ్చారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయ ఆవరణలో మంగళవారం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, డీఆర్‌ఓ సంగీత తదితరులు పూజలు నిర్వహించారు. అనంతరం మహిళా ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా కలెక్టర్ శశాంక మాట్లాడుతూ.. బతుకమ్మ పండగ మహిళలకు ప్రత్యేకమన్నారు. తెలంగాణ సంస్కృతిలో భాగమైన బతుకమ్మ పండగ రాష్ట్రం, దేశంలోనే కాకుండా ప్రపంచ దేశాల్లో ప్రాచుర్యం పొందిందని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ శ్రీలత, సీపీఓ సౌమ్య, సంక్షేమాధికారి పద్మజా రమణ, పీడీ మెప్మా, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


లేడీ ఐపీఎస్.. బతుకమ్మతో హ్యాపీస్!

వారంతా ఐపీఎస్ అధికారిణులు, మహిళా పోలీసులు. నిత్యం ఖాకీ దుస్తుల్లో కనిపించేవారు మంగళవారం మాత్రం సంప్రదాయ వస్త్రధారణల్లో తళుక్కుమన్నారు. చీరకట్టులో ఆకట్టుకున్నారు. నగరంలోని డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ మహిళా ఐపీఎస్‌లు శిఖా గోయల్, స్వాతి లక్రా తదితరులు ఆడిపాడారు.



మూసీ మెరిసేలా..

హైదరాబాద్ సమగ్ర సీవరేజీ మాస్టర్ ప్లాన్



- నదిలోకి మురుగును కట్టడి చేసేలా చర్యలు
- అంచనా వ్యయం రూ.17,212 కోట్లు
- 7,034 కి.మీ మేర సీవరేజీ పైపులైన్ నెట్‌వర్క్
- మరోవైపు కొత్త సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు
- కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర సర్కారు ప్రతిపాదనలు

సాక్షి, సిటీబ్యూరో: మూసీ ప్రక్షాళనలో భాగంగా మురుగు నీరు చేరకుండా కట్టడి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. రూ.17,212.69 కోట్ల అంచనా వ్యయంతో హైదరాబాద్ 'సమగ్ర సీవరేజీ మాస్టర్ ప్లాన్'కు రూపకల్పన చేసింది. కేంద్ర ప్రభుత్వ అమృత్ పథకం 2.0 కింద మాస్టర్ ప్లాన్‌ను చేర్చాలని లేదా ప్రత్యేక ప్రాజెక్టుగా చేపట్టేందుకు ఆర్థిక చేయూత అందించాలని ప్రతిపాదించింది. చారిత్రక హైదరాబాద్ నగరంలో ఏళ్లనాటి మురుగు నీటి పైపులైన్ వ్యవస్థ కొనసాగుతోంది. పంచాయతీలుగా ఉన్నప్పుడు వేసిన మురుగు కాల్వలే ఇప్పటికీ కొనసాగుతున్నాయి. మొత్తమ్మీద ప్రస్తుతం 9,769 కిలో మీటర్లు మాత్రమే పైపులైన్ నెట్‌వర్క్ విస్తరించి ఉంది. కొత్తగా జీహెచ్‌ఎంసీ పరిధిలో 2,656 కి.మీ, ఓఆర్‌ఆర్ పరిధిలో 4,378 కి.మీమేర విస్తరించాలని ఉన్న ప్రతిపాదనలు పెండింగ్‌లోనే మగ్గుతున్నాయి. దీంతో సమగ్ర కార్యాచరణలో మురుగు నీటి వ్యవస్థను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు సమాచారం.

80 శాతం మురుగు..

మహా నగరంలోని 80 శాతం మురుగు మూసీలో చేరుతోంది. మిగిలిన 20 శాతం స్థానిక చెరువుల్లో కలుస్తోంది. నగరంలో మూసీ నది సుమారు 55 కిలోమీటర్ల మేర ప్రవహిస్తోంది. దానికి ఇరువైపులా కలిపి 110 కిలోమీటర్ల పొడవునా మురుగు కలుస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్ అర్బన్ ఆగ్లోమెరేషన్ పరిధిలో రోజువారీగా 2,815 ఎంఎల్డీల మురుగు నీరు ఉత్పన్నమవుతోంది. జీహెచ్‌ఎంసీ పరిధిలో 1650 ఎంఎల్డీలు ఉండగా, మురుగు శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ) ద్వారా 772 ఎంఎల్డీల మురుగు నీటిని (46 శాతం) శుద్ధి చేసి మూసీలోకి వదులుతున్నారు.

– తాజాగా రాష్ట్ర ప్రభుత్వం మూసీ సుందరీకరణను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో మురుగు నీరు మూసీలో చేరకుండా కట్టడి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణకు సిద్ధమైంది. అందులో భాగంగానే పైపులైన్ నెట్‌వర్క్ వ్యవస్థ విస్తరణతో పాటు ట్రంక్ సీవర్స్ మెయిన్స్, లార్జ్ సైజ్ బాక్స్ డ్రెయిన్స్, కొత్త సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణాల ప్రాజెక్టుకు రూపకల్పన చేసి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలుస్తోంది.

7,034 కి.మీ సీవరేజీ నెట్‌వర్క్..

హైదరాబాద్‌తో పాటు శివారు, ఓఆర్‌ఆర్ వరకు విస్తరించిన స్థానిక సంస్థల (యూఎల్‌బీ) పరిధిలో సుమారు 7,034 కి.మీ పొడవున మురుగునీటి పైపులైన్ నెట్‌వర్క్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మొత్తమ్మీద ఓఆర్‌ఆర్ యూఎల్‌బీల పరిధిలో 27 పురపాలక సంఘాలను కలుపుకొని సుమారు 4,378 కి.మీ, జీహెచ్‌ఎంసీ పరిధిలోని శివారు, కోర్ సిటీ పరిధిని కలుపుకొని దాదాపు 2,656 కి.మీ పొడవున సీవరేజీ నెట్‌వర్క్ పైపులైన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అందులో జీహెచ్‌ఎంసీలోని శివారు పరిధిలో మూడు ప్యాకేజీల్లో తొమ్మిది సర్కిల్స్ కలుపుకొని 2,232 కి.మీ, కోర్‌సిటీ పరిధిలోని నాలుగు జోన్లలో 424 కి. మీ పైపులైన్ నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.



ప్రతిపాదిత సమగ్ర సీవరేజీ మాస్టర్ ప్లాన్ ఇలా..

శివార్లలో పైపులైన్ నెట్‌వర్క్

ప్యాకేజీ–1
కిలోమీటర్లు : 756.85
సర్కిళ్లు : ఉప్పల్, కాప్రా, మల్కాజిగిరి, అల్వాల్, శేరిలింగంపల్లి

ప్యాకేజీ–2
కిలోమీటర్లు : 643.29
సర్కిళ్లు: రాజేంద్రనగర్, ఎల్బీనగర్

ప్యాకేజీ –3
కిలోమీటర్లు : 831.78
సర్కిళ్లు: కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్

కోర్‌సిటీ పైపులైన్ నెట్‌వర్క్ (కి.మీలలో)		
	జోన్–1	81
	జోన్–4	92
	జోన్– 5	77
	జోన్– 6	174

రూ.4వేల కోట్లతో సీవరేజీ ప్లాంట్లు..

మరోవైపు మూసీపై మురుగు నీటిశుద్ధి కోసం సుమారు 62 సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణాలకు రూ.4 వేల కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్ర సర్కారు ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఈ ప్రాజెక్టును సైతం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ఇప్పటికే మూడు ప్యాకేజీల్లో మొత్తం 31 మురుగు నీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీ) నిర్మాణాల ద్వారా సుమారు 1259.50 ఎంఎల్డీల మురుగునీటి శుద్ధి చేయాలని నిర్ణయించింది. ఇటీవల అమృత్ పథకం కింద 39 ఎస్టీపీలకు గ్రీన్ సిగ్నల్ లభించింది. తాజాగా మూసీలో పూర్తిగా శుద్ధి చేసిన జలాలనే వదిలేలా మరికొన్ని ఎస్టీపీల నిర్మాణాలకు ప్రతిపాదించింది.

నష్టం వాటిల్లకుండా రోడ్డు విస్తరణ

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



అమ్మవారి పూజలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: రోడ్డు విస్తరణ పనులకు స్థానికులు, వ్యాపారస్తులు సహకరించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. మంగళవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి రోడ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పూలే విగ్రహం నుంచి జేపీ దర్గా కూడలి వరకు రూ.18 కోట్లు, పాత జాతీయ రహదారి నుంచి కుమ్మరిగూడ వరకు రూ.32 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ఈ పనుల్లో వ్యాపారులకు, ప్రజలకు సాధ్యమైనంత వరకు నష్టం వాటిల్లకుండా పనులు చేపడతామన్నారు. పెరుగుతోన్న రద్దీ, పట్టణీకరణకు రోడ్ల విస్తరణ తప్పనిసరి అన్నారు. గత ప్రభుత్వం రోడ్ల అభివృద్ధికి ప్రకటనలు చేసింది తప్ప పనులు ప్రారంభించలేదని విమర్శించారు. విడతల వారీగా నియోజకవర్గ వ్యాప్తంగా రోడ్లను అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం 5వ వార్డులో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, నాయకులు దేవేందర్‌ముదిరాజ్, నవీన్‌చారి, నర్సింహ, జనార్థన్‌చారి, హరినాథ్‌రెడ్డి, లక్ష్మయ్య, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫి'కేటుగాళ్లు'!

జిరాక్స్ సెంటర్ కేంద్రంగా నకిలీ ధ్రువపత్రాల తయారీ

- టెన్త్ నుంచి డిగ్రీ వరకు అన్ని బోర్డుల వాటికి రూపం
- అవసరాన్ని బట్టి ఒక్కో సర్టిఫికెట్ రూ.వేలల్లో విక్రయం
- వలపన్ని ఇద్దరిని పట్టుకున్న సౌత్ జోన్ టాస్క్‌ఫోర్స్



పోలీసుల అదుపులో మహఫూజ్ ఇక్బాల్, ఇలియాస్ అహ్మద్

సాక్షి, సిటీబ్యూరో: టెన్త్ క్లాస్ రూ.10 వేలు..ఇంటర్మీడియట్ రూ.15 వేలు..డిగ్రీ రూ.20 వేలు..టెక్నికల్ ఎడ్యుకేషన్ రూ.25 వేలు..జిరాక్సు సెంటర్ కేంద్రంగా తయారు చేసిన నకిలీ విద్యార్హత పత్రాలను ఇలా రేటు కట్టి విక్రయిస్తున్న ముఠాకు సౌత్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు చెక్ చెప్పారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వీరి నుంచి భారీగా నకిలీ సర్టిఫికెట్లు స్వాధీనం చేసుకున్నట్లు అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. మౌలాలీకి చెందిన మహ్మద్ మహఫూజ్ ఇక్బాల్ అంబర్‌పేట ఒవైసీ నగర్‌లో ఎంఎస్ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో జిరాక్సు సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఇందులోనే వివిధ రకాలైన ఆన్‌లైన్ సేవలను అందిస్తున్న ఇతగాడు కొన్నాళ్లుగా తీవ్రనష్టాలు చవి చూస్తున్నాడు. దీంతో తేలిగ్గా డబ్బు సంపాదించనే ఉద్దేశంతో నకిలీ సర్టిఫికెట్ల తయారీకి సిద్ధమయ్యాడు. తన స్నేహితుడైన ప్రేమ్‌నగర్ వాసి షేక్ ఇలియాస్ అహ్మద్‌తో కలిసి రంగంలోకి దిగాడు. ఇతగాడు నకిలీ సర్టిఫికెట్లు అవసరమైన వారిని తీసుకువస్తుండగా...ఇక్బాల్ తన జిరాక్సు సెంటర్‌లోనే ఫొటోషాప్ పరిజ్ఞానంతో వీటిని తయారు చేస్తున్నాడు. ఎదుటి వారి అవసరాన్ని బట్టి ఈ సర్టిఫికెట్లు అధిక ధరలకు విక్రయించి ఇద్దరూ సొమ్ము చేసుకుంటున్నారు. వీరి వ్యవహారంపై దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేంద్ర నేతృత్వంలో ఎస్సైలు కె.నర్సింహులు, జి.ఆంజనేయులు, ఎస్.నవీన్ తమ బృందాలతో దాడి చేసి ఇద్దరు నిందితులను పట్టుకున్నారు. వీరి నుంచి 84 నకిలీ సర్టిఫికెట్లు, నాలుగు ఖాళీ సర్టిఫికెట్లతో పాటు కంప్యూటర్ తదితరాలు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం నిందితులను అంబర్‌పేట పోలీసులకు అప్పగించారు. వీరి నుంచి ఈ నకిలీ సర్టిఫికెట్లను ఎవరెవరు కొన్నారు? దేని కోసం వినియోగించారు? అనే అంశాల పైనా పోలీసులు దృష్టి పెట్టారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

చేవెళ్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశం



వాహనాలు తనిఖీ చేస్తున్న చేవెళ్ల ట్రాఫిక్ పోలీసులు

చేవెళ్ల: వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని.. వాహనాలకు ఇన్సూరెన్స్ తప్పక ఉండాలని చేవెళ్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశం అన్నారు. మంగళవారం ట్రాఫిక్ పోలీసులు ముడిమ్యాల–తోల్‌కట్ట గేట్ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ దసరా పండగకు సొంతూళ్లకు వెళ్లే వారు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించడంతో వారు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారన్నారు. అలాంటి వాహనాలను గుర్తించి వారికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

రెండు కేసులు.. రూ.21 లక్షలు!

- పదిలంగా వెనక్కి ఇప్పించిన సిటీ సైబర్ కాప్స్
- కోర్టు ద్వారా బాధితులకు ఇప్పించిన అధికారులు
- బాధితులు ఇద్దరూ వృద్ధులు కావడం గమనార్హం

సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరాల్లో మోసపోవడం ఎంత తేలికో... ఈ కేసుల్లో నిందితులు అరెస్టు కావడం అంత కష్టం. నగదు వెనక్కు రావడం అనేది దాదాపు దుర్లభమనే చెప్పాలి. దీన్ని పరిగణలోకి తీసుకున్న హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ×గోల్డెన్ అవర్‌×లో తమ దృష్టికి వచ్చిన నేరాల్లో బాధితులకు సత్వర న్యాయం చేస్తున్నారు. వీరి కృషి ఫలితంగా రూ.21,55,331 కోల్పోయిన ఇద్దరు బాధితులకు ఆ మొత్తం పదిలంగా వెనక్కు వచ్చింది. న్యాయస్థానం అనుమతితో నగదు మంగళవారం బాధితులకు చేర్చినట్లు డీసీపీ దార కవిత పేర్కొన్నారు. ఈ కేసుల్లో బాధితులు ఇద్దరూ వృద్ధులు కావడం, జీవిత చరమాంకంలో తమ కోసం దాచుకున్న మొత్తం సైబర్ నేరగాళ్ల పాలు కావడంతో తీవ్ర ఆందోళన పడ్డారు. అయితే సైబర్ క్రైమ్ పోలీసుల చొరవతో ఆ మొత్తం వారికి తిరిగి వచ్చింది. నగరానికి చెందిన ఓ వృద్ధుడికి ట్రాయ్, సీబీఐ అధికారుల పేరుతో సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. ఆయన్ను తీవ్రంగా భయపెట్టి, రూ.8,05,331 కాజేశారు. మరో వృద్ధుడికి ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు నువామా సెక్యూరిటీలో పెట్టుబడుల పేరుతో ఎర వేశారు. తొలుత లాభాలు చూపించి ఆపై భారీ మొత్తం ఇన్వెస్ట్ చేయించుకున్నారు. అలా దఫదఫాలుగా రూ.13.5 లక్షలు కాజేసి మోసం చేశారు. వీరి నుంచి ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించిన సైబర్ క్రైమ్ పోలీసులు బ్యాంకు అధికారులను సంప్రదించి నేరగాళ్ల ఖాతాలు ఫ్రీజ్ చేయించారు. ఈ విషయాన్ని న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లిన అధికారులు ఫ్రీజ్ అయిన మొత్తం బాధితులకు అందించడానికి అనుమతి కోరారు. ఆ ప్రక్రియలు పూర్తి చేసిన తర్వాత నిర్ణీత మొత్తాలను బాధితుల ఖాతాలకు బదిలీ చేయించారు. బాధితులు సైబర్ నేరంలో పోగొట్టుకున్న మొత్తం యథాతథంగా వెనక్కు రావడం అరుదని అధికారులు చెప్తున్నారు.

నేడు 'చలో శంషాబాద్'

- మాదిగలను మోసం చేసిన ముఖ్యమంత్రికి బుద్ధిచెబుదాం
- ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కిరణ్ పూలే



మాట్లాడుతున్న కిరణ్‌పూలే తదితరులు

తలకొండపల్లి: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం శంషాబాద్‌లో చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కిరణ్ పూలే అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ కులాల వర్గీకరణకు ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకువచ్చి ఉద్యోగ నియామకాలకు వర్తించేలా చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట ఇచ్చి తప్పారని ఆరోపించారు. మాట ఇచ్చి తప్పిన సీఎంకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. శంషాబాద్‌లో చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. మాదిగ విద్యార్థులు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీస్ నాయకులు నారాయణ, శ్రీశైలం, మహేశ్, ప్రహ్లాద్, వంశీ, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



ఆమనగల్లు: పట్టణ సమీపంలోని దుబ్బగుట్టపై మంగళవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఆమనగల్లు ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపిన ప్రకారం.. వారం క్రితం దాదాపు 35 ఏళ్ల ఉన్న వ్యక్తి దుబ్బగుట్టపైకి ఎక్కి పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడన్నారు. మంగళవారం స్థానిక చెంచు కాలనీకి చెందిన యువకులు సీతాఫలాలకు గుట్ట ఎక్కగా దుర్వాసన వస్తుండడంతో అటుగా వెళ్లి పరిశీలించారు. అక్కడ కుళ్లిన స్థితిలో శవం కనిపించడంతో తమకు సమాచారం ఇచ్చారన్నారు. మృతదేహం వద్ద పురుగు మందు డబ్బాలు, వాటర్ బాటిల్ గుర్తించామన్నారు. మృతుడి వద్ద ఉన్న బ్యాగులో చీరలు, కమ్మరిపనికి ఉపయోగించే పనిముట్లున్నాయని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశామన్నారు. సంఘటనాస్థలాన్ని ఆమనగల్లు సీఐ ప్రమోద్ కుమార్ పరిశీలించారు.

మంత్రాలతో మర్డర్ చేస్తా!

చేతబడితో చంపేస్తానంటూ నకిలీ బాబా ప్రచారం

- తన అత్తింటి వారిని హత్య చేయాలంటూ అతడితో ఓ మహిళ డీల్
- క్షుద్రపూజలు చేసి ఆ వీడియోలను అత్తింటికి పంపిన వైనం
- వీరికి చెక్ చెప్పిన సౌత్–ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు



క్షుద్ర పూజలు చేస్తున్న నకిలీ బాబా కాలీ

సాక్షి, సిటీబ్యూరో: నకిలీ బాబాగా అవతారం ఎత్తిన ఓ మాజీ రౌడీషీటర్ మంత్రాలతో మర్డర్లు చేస్తానంటూ ప్రచారం చేసుకున్నాడు. ఈ క్రమంలో తన అత్తింటి వారిపై ఉన్న కక్షను ఇతడి ద్వారా తీర్చుకోవాలని భావించిందో మహిళ. అత్తింటికి వ్యతిరేకంగా క్షుద్ర పూజలు చేయిస్తూ తీసిన వీడియోను వారికి చేరేలా చేసింది. ఈ పరిణామంతో తీవ్ర భయాందోళనకు గురైన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నకిలీ బాబాకు సౌత్–ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు చెక్ చెప్పారు. పరారీలో ఉన్న మహిళ కోసం గాలిస్తున్నట్లు మంగళవారం అదనపు డీసీపీ అందె శ్రీనివాస రావు వెల్లడించారు. కేసు వివరాలను ఆయన ఇలా వివరించారు.

ష్యూరిటీ నేపథ్యంలో బాబా పరిచయం..

నగరంలోని బహదూర్‌పురా హసన్‌నగర్‌కు చెందిన మహ్మద్ కలీంకు నేరచరిత్ర ఉండటంతో గతంలో కాలాపత్తర్ పోలీసులు రౌడీషీట్ తెరిచారు. హత్య, హత్యాయత్నం సహా అయిదు కేసుల్లో నిందితుడైన ఇతగాడు 2022 నుంచి కాలీగా పేరు మార్చుకుని నకిలీ బాబా అవతారం ఎత్తాడు. ఇళ్లకు రంగులు వేసే పని చేస్తూనే పూజలు, మంత్రాల పేరుతో పలువురిని బురిడీ కొట్టిస్తున్నాడు. అనారోగ్యం తగ్గడానికి తాయత్తులు, తాళ్లు కడుతూ డబ్బు వసూలు చేస్తున్నాడు. పాతబస్తీకే చెందిన నజియా కొన్నాళ్ల క్రితం ఓ మహిళకు రూ.50 వేలు అప్పుగా ఇచ్చింది. అప్పట్లో ఆమె తరఫున ష్యూరిటీ ఇవ్వడానికి వచ్చిన కాలీతో నజియాకు పరిచయం ఏర్పడింది.

అత్తింటి వారిపై కక్ష తీర్చుకోవాలని..

నజియాకు తన అత్తింటి వారితో స్పర్థలు వచ్చాయి. దీంతో వారిపై కక్షగట్టిన ఆమె హత్య చేయించాలని భావించింది. దీనికోసం కాలీని సంప్రదించగా రూ.10 వేలు ఇస్తే చేతబడితో చంపేస్తానంటూ ఒప్పందం చేసుకున్నాడు. ఆ మొత్తం తీసుకున్న అతగాడు నజియా అత్త, ఆడపడుచు, మరిది పేరుతో బొమ్మలు తయారు చేసి క్షుద్రపూజలు చేశాడు. ఈ తతంగం మొత్తాన్ని నజియా వీడియో చిత్రీకరించింది. గత నెల 2న నజియా మరిదికి ఫోన్ చేసిన కాలీ... క్షుద్రపూజల విషయం చెప్పడంతో పాటు 48 గంటల్లో చనిపోతారంటూ అల్టిమేటం ఇచ్చాడు. ఆ వెంటనే వాట్సాప్ ద్వారా చేతబడి చేస్తున్న వీడియోను పంపాడు.

నిద్రాహారాలు మానేసిన కుటుంబం..

ఈ పరిణామంతో తీవ్ర భయాందోళనలకు గురైన ఆ కుటుంబం నిద్రాహారాలు మానేసింది. తమకు ఏదో జరుగుతోందని భయపడుతూ దైనందిన వ్యవహారాలకు దూరంగా ఉంది. ఎట్టకేలకు ధైర్యం చేసిన నజియా మరిది ఇర్ఫాన్ మాలిక్ బండ్లగూడ ఠాణాలో ఫిర్యాదు చేశారు. కోర్టు అనుమతితో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నిందితుల కోసం సౌత్–ఈస్ట్ జోన్ ఇన్‌స్పెక్టర్ కేఎస్ ప్రసాద్‌వర్మ నేతృత్వంలో ఎస్సైలు షేక్ కవియుద్దీన్, ఎం.మధు, పి.సాయిరాం రంగంలోకి దిగారు. మంగళవారం కాలీని పట్టుకుని అతడి నుంచి చేతబడి సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని బండ్లగూడ పోలీసులకు అప్పగించి పరారీలో ఉన్న నజియా కోసం గాలిస్తున్నారు.

అంతర్రాష్ట్ర ధార్ ముఠాలకు చెక్

గచ్చిబౌలి: చోరీ సమయంలో అడ్డు వస్తే అంతమొందించే కరుడుగట్టిన రెండు అంతర్రాష్ట్ర ముఠాలను సీసీఎస్ మియాపూర్, సీసీఎస్ బాలానగర్ పోలీసులు అరెస్ట్ చేశారని సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ నర్సింహ్మ తెలిపారు. మంగళవారం మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్‌తో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. ఇటీవల రాత్రి ఇళ్లలో చోరీ కేసులు జరిగిన నేపథ్యంలో సీసీఎస్ పోలీసులు స్థానిక పోలీసులతో కలిసి పలు చోట్ల నిఘా ఉంచారని పేర్కొన్నారు. ఈ క్రమంలో మియాపూర్ పీఎస్ పరిధిలోని మక్తాలో అనుమానాస్పదంగా తిరుగుతున్న మధ్యప్రదేశ్ ధార్ జిల్లా కనియంబాకు చెందిన కరన్ మనోహర్ బాబర్, ప్యార్‌సింగ్ బహులా, దేబేంద్ర బహులాను అదుపులోకి తీసుకున్నారు. సోదా చేయగా వారి వద్ద పదునైన కత్తులు, కట్టర్లు, రాడ్లు లభించాయి. కరణ్ మనోహర్ నాయకత్వంలో ఇళ్లలో చోరీలు చేసినట్లు అంగీకరించారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. పేట్‌బషీరాబాద్ పీఎస్ పరిధిలో గుండ్లపోచంపల్లిలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ధార్ జిల్లా కనియంబాకు చెందిన కడక్ సింగ్, ఠాకేర్ ఎడియా, కుమన్ ఎడియాలను అదుపులోకి తీసుకొని విచారించగా రాత్రి సమయంలో ఇళ్లలో చోరీలు చేసినట్లు అంగీకరించారు. మరో ముగ్గురు నిందితులు పరారైనట్లు తెలిపారు. సైబరాబాద్‌లో 17, రాచకొండలో 9, మెదక్ 4, సంగారెడ్డి 5, నల్గొండ జిల్లాలో 1 కేసులో నిందితులుగా ఉన్నారు. నిందితుల నుంచి 6 కత్తులు, చోరీకి ఉపయోగించే రెండు సెట్ల పనిముట్లు, 4 సెల్ ఫోన్లు, రూ.11.500 నగదు స్వాధీనం చేసుకున్నారు.

రికవరీ కోసం యాక్షన్ ప్లాన్

35 చోరీ కేసుల్లో రెండు కిలోల బంగారం, 10 కిలోల వెండి, రూ.8.5 లక్షల నగదు కొల్లగొట్టారని డీసీపీ నర్సింహ్మ తెలిపారు. పరారీలో ఉన్న ఆరుగురు నిందితులను అరెస్ట్ చేయడం సొత్తును రికవరీ చేసేందుకు యాక్షన్ ప్లాన్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

కుల దైవానికి పూజలు చేసి..

ధార్ జిల్లాలోని అటవీ ప్రాంతాలలో నివసించే ముఠా సభ్యులైన గిరిజనులు చోరీలో భారీ మొత్తంలో సొత్తు, నగదు దక్కాలని తమ ఇష్ట దైవానికి పూజలు చేస్తారు. అనంతరం ఆటోలో ఇండోర్ నగరానికి వచ్చి అక్కడి నుంచి ప్రైవేట్ ట్రావెల్స్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు వస్తారు. గేటెడ్ కమ్యూనిటీలు, ధనవంతులు నివాసం ఉండే ప్రాంతాలను ఎంచుకొని పగలు రెక్కీ నిర్వహిస్తారు. తాళం వేసి ఉన్న ఇళ్లను ఎంచుకొని పరిసరాలలోని చెట్ల పొదల్లో దాక్కుంటారు. రాత్రి 1 గంట నుంచి తెల్లవారు జామున 4 గంటల వరకు ఇళ్లలో చోరీచేసి ఉడాయిస్తారు. ఎవరైనా అడ్డుకోవడానికి, లేదా ప్రతి ఘటించేందుకు యత్నిస్తే చంపేందుకు వెనకాడరు. కొల్లగొట్టిన సొత్తును ఇండోర్‌లో నమ్మకమైన రిసీవర్లకు సొత్తును విక్రయిస్తారు. వచ్చిన డబ్బుతో వ్యవసాయం చేయడంతో పాటు విలాసవంతంగా గడుపుతారు.